# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


## పైలెట్ ప్రాజెక్టుగా ఇటిక్యాల

**గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్.**

**గద్వాల, మే 2,ప్రభాత వార్త:** భూ భారతి చట్టం అమలుకు ఈ నెల 5 నుంచి 16 వరకు ఇటిక్యాల మండలాన్ని పైలట్‌గా ఎంపిక చేసినందున, తహసీల్దార్లు పూర్తిగా సిద్ధంగా ఉండి ప్రజల భూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో భూభారతి చట్టం, రెవెన్యూ సదస్సు పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి చట్టం అమలులో భాగంగా, జిల్లాలోని ఇటిక్యాల మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ మండలంలోని 5న గోపాల్ దిన్నె, 6న వావిలాల, 7న పెద్ద దిన్నె, 8న సత్తర్ల, 09న ఎం.ఆర్. చెరువు, 12న షాదాబ్, 13న ఇటిక్యాల, 14న చాగాపురం, 15న మునగాల, 16న ఉదండాపురం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుండి భూ సంబంధిత దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇటిక్యాల మండలాన్ని పైలట్ మండలంగా ఎంపిక చేసిన నేపథ్యంలో అక్కడ అవసరమైన సిబ్బంది, టీమ్స్, అవసరమైన పత్రాలు, రిజిస్టర్లు మొదలైనవి ముందుగానే సిద్ధం చేయాలని తహసీల్దార్లకు సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ప్రతి రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, రోజువారీగా వాటిని నవీకరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల సహకారంతో కార్యక్రమంపై ప్రచారం నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ఈ కార్యక్రమపు ప్రధాన లక్ష్యమని, అందుకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేసి విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ, తహసీల్దార్లు వీర భద్రప్ప, నరేష్, డిప్యూటీ తహసీల్దార్ నందిని, తదితరులు పాల్గొన్నారు.



## నీట్ పకడ్బందీగా నిర్వహించాలి

- **మహబూబ్‌నగర్‌లో 13 పరీక్షా కేంద్రాలు**
- **కలెక్టర్ విజయేందిర బోయి**

మహబూబ్‌నగర్ బ్యూరో, మే 2 ప్రభాతవార్త: మే 4 న నిర్వహించనున్న నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ )అండర్ గ్రాడ్యుయేషన్ 2025 ప్రవేశ పరీక్షను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. నీట్ యూజీ 2025 ప్రవేశ పరీక్ష నిర్వహణ పై గురువారం కలెక్టర్ కార్యాలయంలో మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, అబ్జర్వర్‌లు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహించాలన్నారు. నీట్ 2025 ప్రవేశ పరీక్ష మే 4న మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని, జిల్లాలో 4454 మంది అభ్యర్థులు నీట్ ప్రవేశ పరీక్ష రాయనున్నారని, ఇందుకుగాను మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎం.వి.ఎస్. గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్, పి ఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజ్, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్, ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, పాలమూరు యూనివర్సిటీ శిబి కాలేజ్ అండ్ అండ్ సైన్స్ బ్లాక్, డా. బి.ఆర్.ఆర్. గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్, గవర్నమెంట్ మోడల్ బేసిక్ హై స్కూల్, ఎం.జె.పి.టి.బి.సి.డబ్ల్యూ. రెసిడెన్షియల్ స్కూల్(బాలికల), టి.జి.ఎస్.డబ్ల్యూ. రెసిడెన్షియల్ స్కూల్ మరియు గర్ల్స్ జూనియర్ రామి రెడ్డి గూడెం లలో ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. నీట్ పరీక్ష పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని , అలాగే పరీక్ష నిర్వహించే రోజు పరీక్ష కేంద్రాల పరిధిలో పూర్తి బందోబస్తుండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద సిసి కెమెరాలతో పాటు, బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలని, అన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స సౌకర్యాలు కల్పించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆమె ఆదేశించారు. పరీక్ష కేంద్రాలలో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, ఎక్కడ ఎలాంటి తప్పు జరగకుండా పరీక్షలను సీరియస్ గా తీసుకొని నిర్వహించాలని అన్నారు. అభ్యర్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని ఒకరోజు ముందే వెళ్లి చూసుకోవాలని సూచించారు. అడ్మిట్ కార్డులో లొకేషన్ తో సహా ముద్రించడం జరుగుతుందని, అందువల్ల అభ్యర్థులు ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకుని పరీక్షలను సవ్యంగా రాయాలని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డిఎస్పి వెంకటేశ్వర్లు, నీట్ పరీక్ష నోడల్ ఆఫీసర్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ నరేందర్ సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

## జిల్లాకు ఒక మండలం
# పైలెట్ ప్రాజెక్టు




జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, హాజరైన కలెక్టర్లు

- **వనపర్తి జిల్లాలో గోపాల్ పేట మండలం పైలెట్ ప్రాజెక్టుగా గుర్తింపు**
- **రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**వనపర్తి టౌన్, మే 2 ప్రభాతవార్త:** మే 5 నుంచి ప్రతి జిల్లాలో ఒక పైలెట్ మండలంగా తీసుకొని భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించి అన్ని సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో ప్రతిష్టాత్మంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టాన్ని రాష్ట్రంలోని 4మండలాలను పైలెట్ ప్రాజెక్టు తీసుకొని ప్రజల భూ సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. అదే స్ఫూర్తితో మే 5నుండి అన్ని జిల్లాల్లో ఒక్కో మండలాన్ని పైలెట్ మండలంగా తీసుకొని రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ భారతి చట్టం ప్రకారం భూ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లపై మాట్లాడుతూ గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీ ద్వారా సూచించిన జాబితాను ప్రత్యేక అధికారుల ద్వారా స్క్రూటినీ చేయించి అత్యంత పేద ప్రజలను మాత్రమే లబ్ధిదారునిగా గుర్తించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు రాళ్లతో బేస్ మెట్ కట్టుకున్న లేక పిల్లర్లు వేసి ప్లింత్ భీమ్ వేసుకున్న ఆమోదించాలని కానీ 600 చదరపు అడుగుల్లోపే నిర్మించాల్సి ఉంటుందన్నారు. ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు మాట్లాడుతూ భూ భారతి చట్టం అమలు బాధ్యత రెవెన్యూ అధికారులపైనే ఉందని అందువల్ల చాలా జాగ్రత్తగా నిబంధనలకు అనుగుణంగా మాత్రమే పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో గోపాల్ పేట మండలాన్ని పైలెట్ మండలంగా గుర్తించడం జరిగిందన్నారు. మండలంలోని 9 గ్రామ పంచాయతీల్లో ఉన్న భూ సమస్యల పై ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్దేశించుకున్న గ్రామంలో కూర్చొని ప్రజల నుండి భూ సమస్యల దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ద్వారా నిర్ణిత నమూనాలో దరఖాస్తులు గ్రామంలో ముందుగానే పంచడం జరుగుతుందని వాటిని సరిగ్గా పూరించేందుకు ఇద్దరు ఉద్యోగులను సైతం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పై మాట్లాడుతూ చాలా మండలాల్లో, మున్సిపాలిటీలలో ప్రత్యేక అధికారుల ద్వారా స్క్రూటినీ అనంతరం జాబితా తీసుకోవడం జరిగిందని తెలియజేశారు. జాబితాను ఇంచార్జ్ మంత్రి ఆమోదంతో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి ఉత్తర్వు కాపీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసిల్దార్లు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

## భూ భారతిలో ఆర్‌డివోలు, తాసిల్దార్లు, కీలకం

- **అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల పథకం కేటాయించాలి**
- **నాగర్‌కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే2 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం నాడు చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణ రావుతో కలిసి భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్‌లు, ఎస్పీలతో రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లు, అమరేందర్, దేవ సహాయం, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి మే 20 వరకు పైలట్ ప్రాజెక్టు జిల్లాలు మినహాయించి మిగిలిన జిల్లా లలో ఒక మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని మంత్రి సూచించారు. జూన్ 2 వరకు పైలట్ ప్రాజెక్ట్ క్రింద వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మాణం జరిగేలా కలెక్టర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ఎంతవరకు పూర్తయితే అంతవరకు ఏ రోజుకారోజు ఇన్‌ఛార్జి మంత్రుల నుంచి లబ్ధిదారుల జాబితాకు ఆమోదం తీసుకోవాలని అలాగే ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతంలో కనీసం 500 ఇండ్లను కేటాయించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. హౌసింగ్ కోసం ప్రత్యేకంగా ప్రతి మండలానికి అసిస్టెంట్ ఇంజనీర్లను ప్రభుత్వం కేటాయిస్తుందని అన్నారు. ప్రతిరోజు ఇన్‌చార్జి మంత్రులతో సమన్వయం చేస్తూ అర్హుల జాబితా ప్రకటించి ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలని, మే 10వ తారీఖు లోపు పూర్తి స్థాయిలో ఇండ్లు గ్రౌండ్ చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో భూ భారతి చట్టం అమలు చేయనున్న మండలంలోని గ్రామాలలో రైతుల నుంచి భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులను ఆహ్వానించాలని అధికారులకు తెలియజేశారు. ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాలో నిరుపేదలు ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఇసుకను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. మండలాలో ఎంపిక చేసిన పైలట్ గ్రామాలలో గ్రౌండింగ్ పూర్తి చేసి బేస్మెంట్ వరకు నిర్మించిన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి లక్ష రూపాయల ఆర్థిక సహాయం కూడా అందించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు, మిగతా లబ్ధి దారులు పనులు ప్రారంభించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు తహసిల్దార్లు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

**గద్వాల ప్రతినిధి, మే 2,ప్రభాత వార్త:** భూ భారతి చట్టం నిబంధనల మేరకు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మాత్యులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలిసి భూ భారతి చట్టం, రెవెన్యూ సదస్సులు, నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ఈ నెల 5 నుంచి మే 20 వరకు పైలట్ ప్రాజెక్టు జిల్లాలు మినహాయించి మిగిలిన జిల్లా లలో ఒక మండలాన్ని పైలట్ గా తీసుకొని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యల పై ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని మంత్రి సూచించారు. జూన్ 2 వరకు పైలట్ ప్రాజెక్ట్ క్రింద వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి తెలిపారు. నీట్ పరీక్ష కేంద్రాలను ముందుగా జిల్లా కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి ఏర్పాట్లు పర్యవేక్షించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు తాగు నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, ఓఆర్ఎస్ ప్యాకేట్లతో చిన్న మెడికల్ క్యాంపు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని అన్నారు. సీసీ కెమెరాలు, అవసరమైన మేర పోలీస్ భద్రత కల్పించాలని అన్నారు. ప్రశ్న పత్రాలు స్టోర్ చేసే స్ట్రాంగ్ రూం వద్ద సిసిటివి ఉండాలని, పోలీస్ బందోబస్తుతో పరీక్ష కేంద్రాలకు ప్రశ్నా పత్రాలను తరలించాలని అన్నారు. పరీక్ష కేంద్రాల గేటు మధ్యాహ్నం 1.30 గంటలకు మూసి వేయాలని, ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా చెక్ చేసిన తర్వాత మాత్రమే పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించాలని, బయో మెట్రిక్ అటెండెన్స్ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. గతంలో జరిగిన ఎటువంటి పొరపాట్లు మరో సారి పునరావృతం కాకుండా జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. పేదలకు ప్రభుత్వం అందించే శాశ్వత ఆస్తి ఇందిరమ్మ ఇండ్లని, ఇది ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మమైన కార్యక్రమం అని, అర్హుల జాబితా ఎంపిక చేయడం చాలా కీలకం అవుతుందని, అనర్హులకు పథకం అందితే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందే విధంగా మార్గదర్శకాలను పాటించాలని మంత్రి అధికారులకు తెలిపారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, ఎస్పి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, తహసీల్దార్ లు, సంబంధిత హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటిస్తేనే కమిటీ ఆమోదం



వీసీ లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

### త్వరగా గ్రౌండింగ్ చేయాలి

**- మొదటి విడతలో మంజూరయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు : కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, మే 2 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మొదటి విడతలో మంజూరు అయిన ఇళ్లు త్వరగా గ్రౌండింగ్ అయ్యే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఎంపీడీఓలను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపిఒలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పై సమీక్ష నిర్వహించారు. జనవరి 26న మొదటి విడతలో ప్రతి మండలం నుంచి ఒక్కో గ్రామానికి పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని 1300 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. కానీ ఇప్పటి వరకు కేవలం 414 మంది లబ్ధిదారులు మాత్రమే నిర్మాణం ప్రారంభించుకున్నారని, వాటిలో 94 బేస్మెంట్ వరకు పూర్తి అయ్యాయని, 54 ఇళ్లకు మొదటి విడత బిల్లు పేమెంట్ అయినట్లు తెలిపారు. అందువల్ల ఎవరైతే ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభించుకోలేదో వారితో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. ఎవరైనా మాకు ఇష్టం లేదు అంటారో వారి నుండి లిఖిత పూర్వకంగా రాయించుకోవాలని ఆదేశించారు. ఇష్టం లేని వారిస్తానంలో ఇతర పేద కుటుంబాలకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ మే 10 నాటికి పూర్తి కావాలని ఆదేశించారు. నిర్మాణం ప్రారంభించిన వారు 600 చదరపు అడుగులలో మాత్రమే కట్టుకోవాలని ఎవరైనా ఎక్కువ స్థలంలో ఇల్లు ప్రారంభించుకొని ఉంటే కుదించుకునే విధంగా ఒప్పించాలని లేనిపక్షంలో ఇందిరమ్మ ఇళ్లు రద్దు చేయాలని సూచించారు. రెండవ విడతలో భాగంగా ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన నివేదిక ఆధారంగా లక్ష్యం మేరకు ప్రత్యేక అధికారులు స్క్రూటినీ చేసిన జాబితాను కలెక్టర్ లాగిన్ కు పంపించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, హౌసింగ్ పిడి. పర్వతాలు, డి. ఈ విటోభ పాల్గొన్నారు.

### వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తిటౌన్, మే 2 ప్రభాతవార్త:** కొత్తగా ఏర్పాటు చేసే లే అవుట్‌లలో ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని నిబంధనలు పాటిస్తేనే కమిటీ ద్వారా ఆమోదం పొందుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన లే అవుట్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన లే అవుట్‌లను దస్తావేజులు, గూగుల్ ఎర్త్ మ్యాపింగ్ ద్వారా పరిశీలించి అన్ని అర్హతలు ఉన్న లే అవుట్‌లను కెనాల్, ముంపు, నాలా సమస్యలు లేకుండా నిబంధనల ప్రకారం రోడ్లు, ఖాళీస్థలం, పార్కింగ్ ఉన్న లే అవుట్‌లను మాత్రమే కమిటీ ద్వారా ఆమోదించడం జరుగుతుందన్నారు. రోడ్లు 10 శాతం ఖాళీ స్థలం ప్రభుత్వం పేరున రిజిస్టర్ చేయాల్సి ఉంటుందని, అదేవిధంగా రోడ్లు, డ్రైన్, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఒక్కో లే అవుట్‌ను గూగుల్ మ్యాప్ ద్వారా క్షుణ్ణంగా పరిశీలించి ఇరిగేషన్, మున్సిపల్ అధికారి, రోడ్లు భవనాల ఇంజనీరు, టౌన్ ప్లానింగ్ అధికారుల అభిప్రాయం, అభ్యంతరాలు తెలుసుకొని కమిటి ఆమోదించడం లేదా తిరస్కరించడం జరిగింది. శుక్రవారం రోజు కమిటీ ముందు మొత్తం (6) లే అవుట్‌లు పరిశీలనకు రాగా ఇందులో నిబంధనల ప్రకారం అన్ని సరిగ్గా ఉన్న (4) లే అవుట్ లు ఆమోదించడం జరిగింది. మిగిలిన (2) పెండింగ్‌లో పెట్టినట్లు కలెక్టర్ తెలిపారు. నిబంధనలు పూర్తి చేయగానే పెండింగ్‌లో ఉన్న వాటిని సైతం కమిటీ ద్వారా ఆమోదించనున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, ఇరిగేషన్ ఇంజనీర్లు, డి.ఈఆర్అండ్‌బి మున్సిపల్ కమిషనర్లు, టిపిఒలు, లే అవుట్ యజమానులు, ప్లానర్‌లు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 02 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తోందని, సమాజంలోని ప్రతి వర్గానికీ ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తిమ్మాజిపేట, తాడూరు మండలాల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండలంలోని వివిధ గ్రామాలకు సంబందించిన 57 మంది లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తుందన్నారు. ముఖ్యంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, వైద్య చికిత్సల కోసం లేదా అత్యవసర సమయంలో ఆర్థిక సహాయం అవసరమైన సందర్భాల్లో సీఎం సహాయనిధి ద్వారా అందిస్తున్న సహాయాన్ని వారు విశేషంగా కొనియాడారు. ప్రతి పేద కుటుంబానికి అండగా నిలబడే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. సీఎం సహాయనిధి పథకం, కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా సంక్షోభ సమయాల్లో ప్రజలకు ఆశాకిరణంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తపల్లి వినోద్ కుమార్, పలువురు, మండల ముఖ్య నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వే


వావిలాలలో ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాపై సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీవో

**ఇటిక్యాల, మే 2 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేందుకు గ్రామాలలోని ఇందిరమ్మ కమిటీల ద్వారా అధికార పార్టీకి చెందిన ఇంచార్జి ద్వారా సేకరించిన జాబితాను జిల్లా కలెక్టర్‌కు పంపించారు. కలెక్టర్ ద్వారా గ్రామాల వారీగా ఇందిరమ్మ ఇండ్ల జాబితాపై అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు గ్రామాలలో అధికారులు విచారణ చేపడుతున్నారు. శుక్రవారం మండల పరిధిలోని వావిలాల, పెద్దదిన్న గ్రామాలలో ఎంపీడీవో మహమ్మద్ అజాద్ మోహియుద్దీన్ ఆ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. జాబితా ప్రకారం అర్హులైన వారిని ఎంపిక చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న జాబితాను అనర్హులుగా చేస్తున్నారు. మండలంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి. మండల పంచాయతీరాజ్ ఇన్చార్జి ఏఈ ఆధ్వర్యంలో శనగపల్లి నక్కలపల్లి, ఉదండాపురం, వావిలాల, మునగాల గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికపై అధికారులు సర్వే నిర్వహించారు. ఆ జాబితాను జిల్లా కలెక్టర్‌కు వారు అందజేయనున్నారు. ఇంకా చాలా గ్రామాలలో ఇందిరమ్మ కమిటీలు ఇండ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారుల జాబితాను కలెక్టర్‌కు నివేదించలేదు. సర్వేలో పంచాయతీ కార్యదర్శులు శంకర్ నాయక్, రామకృష్ణ కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## అక్షయను అభినందించిన కలెక్టర్ సంతోష్


అక్షయను అభినందించిన జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల, మే 2,ప్రభాతవార్త:** పదవ తరగతి పరీక్షల్లో 566 మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఎస్. అక్షయను జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అభినందించారు.శుక్రవారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎస్.అక్షయ పదవ తరగతి బోర్డు పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా,ఆమెను అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలల నుండి చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ స్థాయిలో రాణించగలరని అన్నారు. విద్య ద్వారా బాలికల సాధికారత పెరుగుతుంద ని,విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని తెలిపారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జహురుద్దీన్, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను సన్మానించిన మండల అధికారులు


సన్మానిస్తున్న మండల అధికారులు

**ఆత్మకూర్ , మే 2,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం గురువారం రోజు విడుదల చేసినటువంటి పదవ తరగతి వార్షిక పరీక్షల్లో మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణానికి చెందిన విద్యార్థినులు అత్యంత ప్రతిభ కనబరిచిన నేపథ్యంలో శుక్రవారం రోజు ఆత్మకూరు మండల విద్యాధికారి బాలరాజు మరియు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపాదూ తదితరులు విద్యార్థిని విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఉమ్మడి ఆత్మకూరు మండలంలోని 600 మార్కులకు గాను 577 మార్కులు సాధించి అత్యంత ప్రతిపాదికనపరిచిన విద్యార్థిని మంజుల అంతేకాకుండా శ్రీవాణి పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ బెస్ట్ అవైలబుల్ విద్యార్థిగా పేరుగాంచిన నిఖిల్ను మండలాధికారులు ప్రత్యేకంగా సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు కష్టపడి చదివి సమాజానికి ఉపయోగపడే విధంగా జీవితాలను తీర్చిదిద్దుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో శివాని పాఠశాల ప్రిన్సిపాల్ లతా పాఠశాల సలహాదారులు విశ్వేశ్వర్ రాములు, గంగాధర్ ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూభారతిలో పైలెట్ ప్రాజెక్టుగా ఇటిక్యాల మండలం ఎంపిక

**5నుండి 16 వరకు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు తహసీల్దార్ వీరభద్రప్ప**



**ఇటిక్యాల, మే 2 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభు త్వం ధరణి స్థానంలో భూభారతి చట్టం కొత్తగా తీసుకొచ్చి రాష్ట్రంలో నాలుగు మండలా లను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. అయితే జోగులాంబ గద్వాల జిల్లాలో ఇటిక్యా ల మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా జిల్లా కలెక్ట ర్ బి.ఎం సంతోష్ నిర్ణయించినట్లు తహసిల్దా ర్ వీరభద్రప్ప తెలిపారు. మండలంలో 9 రెవెన్యూ గ్రామాలలో ఈనెల 5వ తేదీ నుం డి 16వ తేదీ వరకు రెవిన్యూ సదస్సులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు తాహ సిల్దార్ తెలిపారు.5న గోపల్ దిన్నె,6న వావిలాల, 7న పెద్ద దీన్నే, 8న సాతర్ల, 9న మొగలి రావల్ చెరువు, 12న షాబాద్, 13న ఇటిక్యాల, 14న చాగాపురం, 15న మునగాల, 16న ఉదండాపురం గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు రైతులు భూ సమస్యలు ఉన్నవారు సదస్సులలో దరఖాస్తులు చేసుకోవాలని వాటిని విచారించి ప్రతి దరఖాస్తులను ఆన్‌లైన్ లో నమోదు చేసి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గ్రామాలలో రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ వీరభద్రప్ప కోరారు.

## ధాన్యం నగదును రైతులకు చెల్లించాలి


రైతులతో మాట్లాడుతున్న కిసాన్ సంఘ్ నాయకులు

**బిజినేపల్లి, మే 2 ప్రభాతవార్త :** రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం నగదును సకాలంలో రైతుల ఖాతాల్లో జమ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు గండ్ల చంద్రయ్య, మండల మధు బాబు డిమాండ్ చేశారు. లట్టుపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి రైతులతో మాట్లాడారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యంను తేమ పేరుతో కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలుసుకొని రైతాంగంతో మాట్లాడారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ఇప్పటివరకు రైతుల నుంచి సేకరించిన 6,190క్వింటాళ్ల ధాన్యం నగదును రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. 48 గంటల్లో రైతాంగానికి ఎలాంటి కటింగ్ లేకుండా చెల్లింపులు చేపట్టాలన్నారు. మధ్య దళారులను నమ్మి దాన్యం విక్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, కృష్ణయ్య, పీరునాయక్, సత్తార్ తదితరులు ఉన్నారు.

## ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సన్మానం

**మూసాపేట్,మే 2 ప్రభాతవార్త :** మూసాపేట మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు హరికృష్ణ, నహీం,స్నేహిత, పదవ తరగతిలో టాపర్లుగా నిలిచారు. వారిని శుక్రవారం శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థులను శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆలయంలో వారి పేర్ల మీద అర్చన కార్యక్రమం చేపట్టడం జరిగింది. విద్యార్థులు చదువుల్లో ఉన్నత స్థాయి రాణించి మూసాపేట గ్రామానికి వారి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పలువురు కోరారు. కార్యక్రమంలో మండల బిసి పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడు నల్ల తిరుపతయ్య గౌడ్, నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు ఉందెకోడు కృష్ణయ్య, ఆలయ కమిటీ సభ్యులు సందుల ఆంజనేయులు, సిజి మధు, వెంకటంపల్లి రాజు, ముక్తార్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

**బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ సంతోష్ రెడ్డి**

**చిన్న చింతకుంట, మే 2 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను అర్హులకు కేటాయించాలని బిఎస్పి నియోజకవర్గ కన్వీనర్ బసిరెడ్డి సంతోష్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం దమగ్నాపూర్ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక అస్తవ్యస్తంగా ఉందని పూరి గుడిసె ఉండి ప్లాస్టిక్ కవర్ కప్పుకున్న నిరుపేదలకు ఇల్లు కేటాయించకపోవడం దారుణం అన్నారు. గ్రామంలో ఒక నిరుపేద కుటుంబం 40 గజాలలో పూరి గుడిసెలో నివాసం ఉంటున్నారు. వారికి ఇందిరమ్మ ఇల్లు పూరి గుడిసె స్థానంలో కట్టాలని చెప్పడం బాధాకరమని వారికి స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఎంపిక సంబంధిత జాబితాను ఇవ్వాలని అధికారులు కోరిన జాబితా ఇవ్వడం లేదని ఆయన తెలిపారు. ఏది ఏమైనా ఇల్లు లేని నిరుపేద లైన అర్హులకు ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలి

- మిల్లర్లు లోడింగ్, అన్‌లోడింగ్ విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలి
- వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్


ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,మే2 ప్రభాతవార్త:**ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలని, మిల్లర్లు లోడింగ్, అన్‌లోడింగ్ విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ మండలంలోని నల్లవెల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ దేవ సహాయం, తహసిల్దార్ తబిత రాణిలతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని, ధాన్యం కొనుగోళ్ల రిజిస్టర్‌లను తనిఖీ చేసి, ఓపీఎంఎస్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారా? రైతులు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని ప్రతిరోజూ పరిశీలిస్తున్నారా? సకాలంలో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారా? అలాగే కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం కుప్పల గురించి పలు వివరాలను కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో వారు స్పందిస్తూ.. ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను ఓపీఎంఎస్‌లో నమోదు చేస్తున్నామని, కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని కూడా ప్రతిరోజూ పరిశీలించి, కావాల్సిన తేమ శాతానికి రాగానే కాంటా పూర్తిచేసి మిల్లులకు తరలిస్తున్నామని కేంద్ర నిర్వాహకులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తైన వెంటనే ఓపీఎంఎస్ లో ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేయాలని, తద్వారా సకాలంలో రైతులకు డబ్బులు అందుతాయని, అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కువ రోజుల వరకు కేంద్రంలోని పెట్టుకోకుండా తేమ శాతం రాగానే కాంటా పూర్తిచేసి, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలన్నారు. నిత్యం అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, పౌరసరఫరాల శాఖ అధికారులు రోజు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, పరిశీలించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని కేంద్ర నిర్వాహకులను హెచ్చరించారు. తాలు లేకుండా సరిచూసుకోవాలని, తేదీ, రైతు పేరు, ఫోన్ నంబర్, ధాన్యం కొనుగోళ్ళ పూర్తి వివరాలతో రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేయాలని, తేమ శాతం వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలు పూర్తిచేసి, అదే రోజు సంబంధిత మిల్లులకు తరలించాలని, కేంద్రాల్లో ఎక్కువ రోజుల వరకు నిల్వ చేయకూడదని కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. అంతకుముందు రైస్ మిల్లును సందర్శించి ధాన్యం లోడింగ్ అన్ లోడింగ్ స్టాక్ రిజిస్టర్ పరిశీలించి సమర్థ నిర్వహణకు తగు సూచనలు చేశారు.

## కులగణనతో దేశంలో సామాజిక ఐక్యత బలపడుతుంది


ప్రధాని నరేంద్ర మోడీకి క్షీరాభిషేకం చేస్తున్న బిజెపి నాయకులు

**పెబ్బేరు మే 2 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ వనపర్తి జిల్లా ఓ బి సి మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎం రాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో పెబ్బేరు పట్టణంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతోపాటు కులగణనను చేపట్టాలని మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. పారదర్శకతతో దేశవ్యాప్తంగా కులగణన చేయడం ద్వారా రాజకీయ ప్రయోజనాలకంటే సామాజిక అభివృద్ధికే పెద్దపీట వేస్తున్నట్టు ప్రకటించింది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు వారి స్వార్ధ రాజకీయ కారణాలతో కులగణనకు కాంగ్రెస్ తొలినుంచీ వ్యతిరేకం బిజెపి ప్రభుత్వం జరిపే జన, కుల గణనతో దేశం పటిష్ఠంగా మారుతుంది.ఏ వర్గాన్నీ నొప్పించకుండా 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటాను మేం తీసుకొచ్చాం అదేవిధంగా అందరికీ న్యాయం జరిగేలా కుల గణన ఉంటుంది అని కేంద్ర సమాచార మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పడం జరిగింది అన్నారు.కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలతోపాటే కులగణనను నిర్వహించాలని తీర్మానించారు.స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి చేపట్టిన జనాభా లెక్కల్లో కులగణనను చేర్చలేదు.2010లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ నేతృత్వంలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో కుల గణనపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.ఆమేరకు లోక్‌సభకు హామీ ఇచ్చారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి కులగణనను వాడుకుంటున్నాయి అని ఆయన ఆరోపించారు.తాము జరిపే జనగణన, కులగణనతో దేశ సామాజిక, ఆర్థిక నిర్మాణం పటిష్ఠం అవుతుందని, దేశం అభివృద్ధి పథంలోకి పయనిస్తుందన్నారు. దేశ, సమాజ ప్రయోజనాలకు, విలువలకు మోదీ ప్రభుత్వం ఎంత కట్టుబడి ఉందో ఈ నిర్ణయంతో స్పష్టమవుతుందన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వేమారెడ్డి, పట్టణ అధ్యక్షులు క్రాంతి కుమార్,ఓబీసీ మోర్చా వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, పట్టణ మాజీ అధ్యక్షులు ఆంజనేయులు, విద్యా సెల్ జిల్లా కన్వీనర్ నరసింహనాయుడు, శ్రీకాంత్, అరవింద్, కార్తీక్, రమేష్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## అందుబాటులో లేని విద్యుత్ అధికారులు

**నిత్యం అంధకారంలో ఉప్పునుంతల .. విద్యుత్ అధికారుల కేరాఫ్ అడ్రస్ కల్వకుర్తి**

**ఉప్పునుంతల, మే 2 ప్రభాతవార్త :** ప్రజా పాలనలో అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో నిత్యం విద్యు త్తు అంతరాయం ఏర్పడిన పట్టించుకునే నాథుడే లేడు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మండల కేంద్రంలో విద్యుత్తు అంతరాయం జరగకుండా చూడాల్సిన అవసరం ఉంది. కానీ ఉప్పునుంతలలో పనిచేసే విద్యుత్ అధికారులు కల్వకుర్తి పట్టణంలో నెలవలు ఏర్పాటు చేసుకుని మొక్కుబడిగా కొలువులు నిర్వహిస్తున్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో నాయకుల అలసత్వాన్ని ఆసరా చేసుకుని విద్యుత్ అధికారులు పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేస్తున్నారు. చినుకు పడితే చిత్తడి చిత్తడిగా మారిన ప్రాంతాలుగా వేసవి కాలంలో వస్తున్న కొద్దిపాటి ఈదురు గాలులకు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పాటు వాతావరణం అను కూలించినప్పటికీ కిందిస్థాయి సిబ్బంది కుంటి సాకు సమాధానాలు చెప్పడంతో మండల కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న విద్యుత్ అధికారులు వెను వెంటనే విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏమిటని విద్యుత్తు వినియోగదారులు విద్యుత్ అధికారులను ఫోన్ల ద్వారా అడగడంతో మాకేం తెలియదని సిబ్బంది చెప్పారు, ఈదురుగాలులు వస్తున్నాయంట అందుకని విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరిగిందని సమాధానం చెబుతున్నారు. విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారా లేదా అనే పరిస్థితి నెలకొంది. విద్యుత్ అధికారులు అందుబాటులో లేకపోవడం నిరంతరం అంతరాయం ఏర్పాడం పట్ల పట్టించుకునే నాధుడే కరువయ్యారు. ఇప్పటికైనా అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ స్పందించి ఉప్పునుంతల మండలంలో పనిచేస్తున్న విద్యుత్ అధికారుల పని తీరుపట్ల చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## అధర్మంపై ధర్మం గెలవాలి : జిల్లా ఎస్పీ రావుల గిరిధర్


పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ

**వనపర్తి క్రైమ్, మే 2 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలో మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నేరస్తునికి 20 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష రూ.25 వేలు జరిమానా విధించడంతోనే కాక జిల్లాలోని వివిధ కేసుల్లో నేరస్తులకు శిక్ష పడడంలో కృషిచేసిన ఫోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, టి. శ్రీనివాసచారిని, కోర్టు లైజనింగ్ అధికారి హెడ్ కానిస్టేబుల్ సత్యంను శుక్రవారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అనాదిగా అధర్మంపైన ధర్మమే గెలుస్తుంది కాబట్టి నిజాన్ని గెలిపించే బాధ్యత ప్రభుత్వ న్యాయవాదులపై ఉంటుందని ఎస్పీ గుర్తు చేశారు. పోలీసు న్యాయ వ్యవస్థలో బాగాపనిచేసిన అధికారులను తప్పక గుర్తిస్తామని తెలిపారు. ప్రభుత్వ పరంగా బాధితులకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు అండగా ఉండి వారి తరుపున వాదనలు వినిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే ఉత్సాహంతో జిల్లాలో బాగా కష్టపడి పనిచేసి నేరస్తులకు శిక్ష పడేవిధంగా చూడాలని తెలిపారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగతా జిల్లాలోని పోలీసులు ఇంకా బాగా పనిచేసి జిల్లా న్యాయస్థానానికి, పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ,ఉమామహేశ్వరరావు, జిల్లాకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్,గోపాల్‌రెడ్డి,స్పెషల్ బ్రాంచ్ సీఐ,నరేష్, సిబ్బంది ఉన్నారు.

## పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన హెచ్ డబ్ల్యూఓలను అభినందించిన కలెక్టర్ సంతోష్


హెచ్‌డబ్ల్యూఓ లను అభినందించిన కలెక్టర్ సంతోష్

**గద్వాల, మే 2,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన 10 మంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్‌ను అభినందించిన జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్. శుక్రవారం ఐడిఓసి కలెక్టర్ చాంబర్ నందు ప్రభుత్వ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్॥ ఎంపికైన అభ్యర్థులు జిల్లా కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్, నియమితులైన ఉద్యోగులకు అభినందనలు తెలుపు తూ, వారు తమ హాస్టల్స్‌లో విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలని, విద్యార్థుల భద్రత,ఆహారం,వసతి మొదలైన వాటిపై శ్రద్ధ పెట్టి పనిచేయాలని సూచించారు. నియామక పత్రాలు అందుకున్న వారికి వివిధ ప్రాంతాల్లోని హాస్టల్స్‌లో బాధ్యతలు అప్పగించబడ్డాయని తెలిపారు. మన్నె సాయి సౌజన్యకు అల్లంపూర్ మండలంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల హాస్టల్, సురేష్ గౌడ్‌కు మల్దకల్ మండలంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్,బస్వరాజుకు గట్టు ప్రాంతంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్,రమేష్‌కు గద్వాల్‌లోని ప్రభుత్వ ఎస్సీ కాలేజ్ బాయ్స్ హాస్టల్, ఆంజనేయులుకు గద్వాల్‌లోని ప్రభుత్వ ఎస్సీ బాయ్స్ హాస్టల్ బి,రామ్ గోపాల్‌కు మనోపాడ్ ప్రాంతంలోని ప్రభుత్వ ఎస్సీ బాయ్స్ హాస్టల్,జయరాంకు రాజోలి ప్రాంతంలోని ప్రభుత్వ ఎస్సీ బాయ్స్ హాస్టల్,శేషన్నకు ఉండవెల్లి ప్రాంతంలోని ప్రభుత్వ ఎస్సీ బాయ్స్ హాస్టల్, నరేష్‌కు వల్లూరు ప్రాంతంలోని ప్రభుత్వ ఎస్సీ బాయ్స్ హాస్టల్,ప్రసాదుకు అలంపూర్ మండలంలోని ప్రభుత్వ ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ అధికారి సరోజమ్మ ,తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్‌ను తనిఖీ చేసిన తహసీల్దార్ ఎల్లన్న


రైస్ మిల్ లోని రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్


రోడ్డుపై వరి ధాన్యం బస్తాలతో నిలిచిన వాహనాలు

**చిన్నచింతకుంట ,మే 2 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని గూడూరు శివారులో ఉన్న శ్రీ కురుమూర్తి స్వామి రైస్ మిల్లును బుధవారం తహసిల్దారు ఎల్లన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. అప్పంపల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల నుంచి వరి ధాన్యం బస్తాలతో వచ్చిన ట్రాక్టర్లు నిలిచి పోవడంతో తహసిల్దార్ రైస్‌మిల్ యాజమాన్యంతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే వరి దానం బస్తాలను త్వరగా అన్‌లోడు చేయాలని సూచించారు. వరిధాన్యం బస్తాలను దింపేం దుకు సరిపడా హమాలీలను నియమించుకోవాలని, సరిపడా హమా లీలు లేకనే వరి ధాన్యంతో వచ్చిన ట్రాక్టర్లు రోడ్లపై నిలిచిపోయా యని వెంటనే అన్‌లోడ్ చేసేలా రైస్ మిల్లు యజమానులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైస్‌మిల్ వద్ద ఉన్న రైతులతో తహసిల్దార్ మాట్లాడారు. సాయంత్రం అయితే చాలు మేఘాలు కమ్ముకొని ఈదురుగాలులతో వర్షాలు వచ్చే ప్రమాదం ఉందని రైతులు తహసిల్దారుకు విన్నవించారు. రైస్ మిల్‌కు వచ్చే వరిధాన్యం బస్తాలను వెంటనే అన్‌లోడ్ చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని రైస్ మిల్ యజమాన్యానికి ఆయన సూచించారు తహసిల్దార్ వెంట ఆర్ఐ తిరుపతయ్య ఉన్నారు.

## తొలివిడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కంప్లీట్ చేయాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ఎవరైనా ఎక్కువ స్థలంలో ఇల్లు ప్రారంభించుకొని ఉంటే కుదించుకునే విధంగా ఒప్పించాలని లేనిపక్షంలో ఇందిరమ్మఇళ్లు రద్దు చేయాలని సూచించారు. రెండవ విడతలో భాగంగా ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన నివేదిక ఆధారంగా లక్ష్యం మేరకు ప్రత్యేక అధికారులు స్క్రూటినీ చేసిన జాబితాను కలెక్టర్ లాగిన్ కు పంపించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జియాదయ్య, హౌసింగ్ పిడి. పర్వతాలు, డి. ఈ విటోభ, తహశీల్దార్లు,ఎంపీడీఓలు,ఎంపీఒలు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌ను అభినందించిన జిల్లా కలెక్టర్


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

**చిన్న చింతకుంట, మే 2 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి 2025 చట్టంపై అవగాహన సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకుగాను శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి తన ఛాంబర్‌లో తహసిల్దార్ ఎల్లన్న శాలువాతో సత్కరించి షీల్డ్‌ను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి ఉన్నత అధికారులు ఉన్నారు.

## తెగిపడిన విద్యుత్ వైర్లు, కాలిన రైతుల బోరు మోటర్లు, స్టార్టర్లు

**నవాబుపేట మే 2 ప్రభాతవార్త :** మండల పరిధిలోని దొడ్డిపల్లి గ్రామంలో గురువారం బలమైన ఈదురుగాలులు రావడంతో వ్యవసాయ పొలాలకు అతి చెరువులో 11 కె.వి విద్యుత్ వైర్లు తెగిపోయాయి. దీంతో వైర్లకు భారీగా మంటలు అంటుకొని ఆ ప్రాంతంలోని చుట్టుపక్కల బోరుబావులకు కనెక్షన్‌లో ఉన్న బోరు మోటర్లు స్టార్టర్లకు పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ అంటుకొని పాడయ్యాయి. ఆ ప్రాంతంలో రైతులు మంటలు ఎగిసిపడినంత సేపు భయాందోళనకు గురయ్యారు. సంబంధించిన అధికారులకు కాల్ చేయగా వెంటనే స్పందించి విద్యుత్ తీగలను మరమ్మతులు చేయించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

## వెండి ప్లేట్స్ బహుకరణ

**అలంపూర్ మే 2 ప్రభాతవార్త :** దశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠమైన శ్రీ జోగులాంబ దేవి, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలకు హైదరాబాదుకు చెందిన గ్రీస్మా తండ్రి భద్రయ్య 340 గ్రాముల బరువు గల రెండు వెండి ప్లేట్లు శుక్రవారం రోజు ఆలయ ఈవో పురేందర్ కుమార్కు అందజేశారు. వీటి విలువ సుమారు 34 వేల రూపాయలు ఉంటుందని భక్తుడు తెలిపారు. వీరి వెంట ఆలయ మాజీ కమిటీ మెంబర్ వెంకటరామయ్య శెట్టి తదితరులు ఉన్నారు.

## పది ఫలితాల్లో శ్వేతా విద్యా మందిర్ విద్యార్థుల ప్రభంజనం


టి.హరితను సన్మానిస్తున్న మండల విద్యాధికారి

**కోయిల్ కొండ, మే 2 ప్రభాతవార్త :** మండలంలోని పారుపల్లి శ్వేతా విద్యా మందిర్ హై స్కూల్ విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారని పాఠశాల చైర్మన్ నరేందర్, పాఠశాల ప్రిన్సిపాల్ సుహారా తెలిపారు. శుక్రవారం వారు పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సాధారణ విద్యార్థులచే అసాధారణ ఫలితాలను సాధిస్తున్న ఏకైక పాఠశాల శ్వేతా విద్యా మందిర్ అన్నారు. మా విద్యాలయంలో 13 మంది విద్యార్థులకు 550 మార్కుల పైన, 28 మంది విద్యార్థులకు గల 500 మార్కుల పైన, 9 మంది విద్యార్థులకు 470 పైన మార్కులు సాధించి జిల్లాలోనే ఉత్తమ పాఠశాలగా నిలిచిందన్నారు. టి.హరిత 573, శ్రావణి 571, నందిని 569, శ్వేత 567, చందన 566, ఆ క్షిత 564, నందిని 561, తదితర విద్యార్థులు 100 ఉత్తీర్ణత సాధించడం జరిగిందన్నారు. పదవ తరగతి ఫలితాల్లో ఘన విజయం సాధించడానికి కారకులైన మా పాఠశాల ఉపాధ్యాయుల కు, విద్యార్థుల తల్లిదండ్రులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

**మక్తల్,మే 2 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలోని సాయి జ్యోతి హైస్కూల్ వద్ద నెల రోజుల పాటు నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు, బాల బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. నెల రోజుల పాటు సైక్లింగ్, వాలీబాల్, ఖోఖో, టెన్నికాయిట్ తదితర క్రీడలలో బాల బాలికలకు మెరుగైన శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గం.ల వరకు, సాయంత్రం 4నుంచి 6 గం.ల వరకు శిక్షణ శిబిరం కొనసాగుతుందన్నారు.

## సీలింగ్ భూమిని స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం





ప్రభుత్వ సీలింగ్ భూమిని పరిశీలిస్తున్న స్థానిక తహసీల్దార్

**మానవపాడు, మే 2 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నారాయణపురం గ్రామ శివారులో ఉన్న సర్వే నంబర్ 36లో 9 ఎకరాల 25 గుంటల ప్రభుత్వ సీలింగ్ భూమి కలిగి ఉంది. అయితే గ్రామంలోని దళితులకు అప్పటి ప్రభుత్వం అట్టి భూమిని మంజూరు చేసింది. కానీ అదే మొత్తం సర్వే నంబర్లోని 2.38 గుంటల సీలింగ్ భూమిని రాఘవేంద్ర స్వామి అనే వ్యక్తి రాఘవేంద్ర స్వామి ట్రస్ట్ పేరుతో కొనుగోలు చేసి రెవెన్యూ రికార్డుల నమోదు చేసుకున్నారు. అయితే ప్రభుత్వ భూముల బదలాయింపు నిషేధిత చట్టం 1977 ప్రకారం ఆక్రమించుకున్న వ్యక్తికి అధికారులు నిర్దేశించిన గడువులోగా వివరణ ఇవ్వాల్సిందిగా అధికారులు నోటీసులు జారీ చేశారు. సదరు వ్యక్తి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు గడువులోగా వివరణ ఇవ్వలేదు. దీంతో అధికారులు శుక్ర వారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తాహాసిల్దార్ శ్రీనివాస్ జోషి శర్మ సర్వే నెంబర్ 36 నందు అన్యాక్రాంతం అయిన 2.38 గుంటల భూమిని పరిశీలించారు. అట్టి సీలింగ్ భూమిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు తహసిల్దార్ తెలిపారు.

## మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**రాజాపూర్, మే2 ప్రభాతవార్త:** రాజాపూర్ మండలంలోని రంగారెడ్డి గూడ ఆరోగ్య సబ్ సెంటర్‌లో ఎస్‌విఎస్ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మాతృమూర్తి జనుంపల్లి శశికళ రెడ్డి ప్రారంభించారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ భరత్ నందన్‌రెడ్డి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో పలువురికి ఉచితంగా చికిత్సలు చేసి కావాల్సిన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములుగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైద్యులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అమరచింతలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**అమరచింత మే2 ప్రభాతవార్త:** అమరచింత మున్సిపల్ కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో 2004, 2005 సంబంధించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ, భాస్కర్ సింగ్ మాట్లాడుతూ, పాఠశాలలో చదువుతూ వివిధ రంగాలలో స్థిరపడిన విద్యార్థులు 20 సంవత్సరాలు పూర్తి చేసుకుని మళ్లీ ఒకచోట కలుసుకోవడం ఆనందదాయకమని ఆయన అన్నారు. వివిధ రంగాలలో ఆర్థికంగా ఎదిగిన వారు సామాజిక సేవలో ముందుండాలని అలాగే తోటి విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలని ఆయనకోరారు. అలాగే తమకు చదువులుచెప్పిన విశ్రాంతి ఉపాధ్యాయులు లింగన్న, చెన్నారెడ్డి, మహేష్, సుదర్శన్, చంద్రశేఖర్‌రెడ్డి, రియాజ్, కవిత, సుదర్శన్ రెడ్డిలను పూర్వ విద్యార్థులు శాలువాపూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రఘు రామిరెడ్డి, సురేష్, ఇంతియాజ్, సునీల్, విజయ్‌వీరితోపాటు పూర్వ విద్యార్థులు భారీగా పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 2 ప్రభాతవార్త:** బిజినపల్లి మండలంలోని వెలుగొండ గ్రామానికి చెందిన దిడ్డి రామచంద్రయ్య 2020లో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. దాదాపు 5 ఏళ్లుగా విద్యుత్ అధికారుల ద్వారా అందాల్సిన సహాయం రూ.5 లక్షల సహాయం ఆగిపోయింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి శాయినిపల్లి మాజీ సర్పంచ్ అవంతి శంకర్ గత మూడు నెల క్రితం తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి సంబంధిత అధికారులకు ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని, ఇప్పటికి చాలా ఆలస్యమైందని బాధిత కుటుంబం ఆందోళన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు దిడ్డి రావులమ్మకు రూ.5లక్షల రూపాయల చెక్కును సంబంధిత విద్యుత్ అధికారుల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తపల్లి వినోద్ కుమార్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జనగణనతో పాటు కులగణన చారిత్రాత్మక నిర్ణయం



ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

**బిజినేపల్లి, మే 2 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కుల గణనను ప్రధాని నరేంద్ర మోడి చేపట్టడం చారిత్రాత్మక నిర్ణయమని బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ గుమ్మకొండ భూషయ్య అన్నారు. మండల కేంద్రంలోని పూలే అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడి చిత్రపటానికి మండల బీజేపీ నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. కులగణన, జనగణన చేపట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో పారదర్శకత వస్తుందన్నారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాల ప్రజలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో వాటా దక్కుతుందన్నారు. 1930 తర్వాత దేశంలో కుల గణన చేపడుతున్న కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్రమోడికి, కేంద్ర మంత్రులకు రాష్ట్ర ప్రజల తరుపున కృతజ్ఞతలుతెలుపుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చ నాయకురాలు చంద్రకళ, ఊర్కొండ రఘుబాబు, తిరుపతయ్య, లక్ష్మినారాయణ, రంజిత్, వెంకటేష్, మహేష్, నరసింహ, సత్యం, రమేష్ గౌడ్, నిరంజన్, ప్రశాంత్, భరత్ తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి పరిహారం చెక్కు అందజేత

**బిజినేపల్లి, మే 2 ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతంతో ఐదేళ్ల క్రితం ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులకు విద్యుత్ శాఖ ద్వారా రూ.5 లక్షల పరిహారం చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే డా కూచుకుల్ల రాజేష్ రెడ్డి అందజేశారు. వెల్గొండ గ్రామానికి చెందిన దిడ్డి రామచంద్రయ్య 2020లో విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందాడు. అప్పటి నుంచి విద్యుత్‌శాఖ నుంచి అందాల్సినపరిహారం విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఐదేళ్లుగా అందలేదు. విషయం తెలుసుకున్న శాయిన్‌పల్లి మాజీ సర్పంచ్ మస్కూరి అవంతి శంకర్ మూడు నెలల క్రితం ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిహారం విడుదల చేయించారు. ఐదేళ్ళకు బాధిత కుటుంబానికి న్యాయం చేయించిన ఎమ్మెల్యేను బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలి

● నాగర్‌కర్నూల్ జిల్లా బాదావత్ సంతోష్



ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 02 ప్రభాతవార్త:** మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ మండలం పెద్దాపూర్ గ్రామంలో పలువురు లబ్ధిదారులకు చెందిన నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను జిల్లా అదన కలెక్టర్ దేవ సహాయం, ఎంపీడీఓ కోటేశ్వర్లతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులతో కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడారు. ఇండ్ల నిర్మాణం చేపట్టి ఎన్ని రోజులు అవుతుందని, నిర్మాణానికి మెటీరియల్ ఎక్కడినుండి తెచ్చుకుంటున్నారని, ఇప్పటి వరకు ఎంత ఖర్చయిందని, ఎంత విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం చేపట్టారని గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులను కలెక్టర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలెక్టర్ బాదావత్‌సంతోష్ మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకునే విధంగా చూడాలన్నారు. బేస్మెంట్ పూర్తయినఇండ్లకు 2రోజుల్లో లక్ష రూపాయల చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ గ్రామానికి ఎన్ని ఇండ్లు మంజూరయ్యాయని, ఇప్పటివరకు ఎన్ని ప్రారంభమయ్యాయి అని ఎంపీడీఓను అడిగి తెలుసుకున్నారు. బేస్మెంట్ పూర్తి చేసుకున్న లబ్ధి దారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

## ప్రాగటూరులో అర్ధరాత్రి అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది,పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**మానవపాడు, మే2 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా ఉండవల్లి మండలం ప్రాగటూరు గ్రామంలో గురువారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామస్తుల వివరాల మేరకు అర్ధరాత్రి సమయంలో ఒక మహిళకాల కృత్యాలు తీర్చుకునేందుకు మేల్కొనగా సమీపంలో ఉన్న కల్లాల్లో దట్టమైన మంటలు వ్యాపించి ఉండడాన్ని మహిళ చూడడంతో గ్రామస్తులకు సమాచారాన్ని తెలిపింది. గ్రామస్తులు వెళ్లి చూడగా గడ్డివాములు, ఎద్దుల బండ్లు కాలిపోతూ కనిపించాయి. కల్లాల్లో ఉన్న ఎద్దులను గ్రామస్తులు కాపాడారు. పశువుల కోసం ఏర్పాటు చేసుకున్న గడ్డివాములు కాలిపోవడంతో పశువులకు మేత లేకుండా పోయిందని బాధితులు తెలిపారు. అదేవిధంగా ఈ ప్రమాదంలో 500కు పైగా పైపులు కాలి బూడిదయ్యాయని బాధితులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసే ఘటనపై జిల్లా అడిషనల్ కలెక్టర్, స్థానిక తహసిల్దార్ ప్రభాకర్‌కు ఫోన్ చేసి అగ్ని ప్రమాదంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మార్వోకు ఆదేశించారు. అయితే ఇది ఎవరోకావాలని చేశారా? లేకపోతే ప్రమాదవశత్తు జరిగిందా? అన్న విషయాలు తెలియాల్సి ఉంది. భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని ఇంతటి ఘాతుకానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నాను.

**కాంగ్రెస్ నాయకుల పరామర్శ:** అగ్నిప్రమాదం సంభవించిన ఘటన స్థలాన్ని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్, మండల అధ్యక్షులు గోపాల్, రమణ తదితరులు పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.

## నూతన భవనంలోకి ప్రభుత్వ కళాశాల వసతి గృహం

■ రాచాలకు ధన్యవాదాలు తెలిపిన విద్యార్థులు



ఇటీవల ప్రారంభించిన నూతన కళాశాల వసతి గృహం భవనం

**వనపర్తి క్రైమ్, మే 2 ప్రభాతవార్త :** వనపర్తి మండలం నాగవరం గ్రామంలోని రేకుల షెడ్డులో ఉన్న ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహాన్ని జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల వెనుక భాగంలోని భవనంలోకి మార్చారు. గత నెల ఏప్రిల్ నాలుగో తేదీన కళాశాల వసతి గృహాన్ని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ సందర్శించారు. రేకుల షెడ్డులో విద్యార్థుల ఇబ్బందులను తెలుసుకొని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాడు. విద్యార్థుల పట్లఅధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదని వెంటనే ప్రభుత్వ లేదా ప్రైవేటు భవనంలోకి కళాశాల వసతి గృహాన్ని తరలించడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వసతి గృహం మార్పులో నిర్లక్షయం చేస్తే విద్యార్థులతో కలిసి ఆందోళన చేపడతామని ఆరోజు హెచ్చరించారు. దీంతో స్పందించిన కలెక్టర్ వనపర్తి పట్టణంలో భవనాలపై ఆరా తీసి ప్రభుత్వ పాలిటెక్నిక్



కళాశాలను సందర్శించిన బీసీ పొలిటికల్ జేఏసి నాయకులు

కళాశాల వెనుక భాగంలో ఉన్న భవనాన్ని ప్రభుత్వ కళాశాల వసతి గృహంగా మార్చి ఏప్రిల్ 30 తారీఖున మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డిలు ప్రారంభించారు. కళాశాల వసతి గృహ మార్పులు తెలుసుకున్న బీసీ పొలిటికల్ జేసి నాయకులు శుక్రవారం వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి మంచిగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నతంగా రాణించుటకు కృషి చేయాలని కోరారు. కళాశాలను నూతన భవనంలోకి మార్చినందుకు విద్యార్థులు రాచాల యుగంధర్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కళాశాలను సందర్శించిన వారిలో వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, రాష్ట్ర కార్యదర్శి వెంకటన్న గౌడ్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, అస్కని రమేష్, ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షులు రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

## విద్యా రంగాన్ని మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలి

**పదవ తరగతిలో గద్వాల జిల్లా 32వ నుంచి 26వ స్థానం.. పెరుగుదలతో ఉత్తమ ఫలితాలు**

**విద్యార్థులకు అభినందనలు తెలిపిన న్యాయమూర్తి గంట కవితా దేవి**



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న దృశ్యం

**గద్వాల ప్రతినిధి, మే2 ప్రభాతవార్త:** పదవ తరగతి పరీక్షల్లో 91.74 ఉత్తీర్ణతతో జోగులాంబ గద్వాల జిల్లా రాష్ట్రంలో 26వ స్థానాన్ని సాధించడంనట్ల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మాజీ కార్యదర్శి గంట కవితా దేవి అన్నారు. గంట కవితా దేవి శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి గంట కవితాదేవి మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో జోగులాంబ గద్వాల జిల్లా 91.74 ఉత్తీర్ణత శాతం సాధించి రాష్ట్రవ్యాప్తంగా 26వ స్థానంని దక్కించుకోవడం సంతోషాన్ని ఇస్తుందని తెలిపారు. గత సంవత్సరం 81.38 ఉన్న ఉత్తీర్ణత ఈ సంవత్సరం 91.74 కి పెరిగి, ఏకంగా10.36శాతంపెరుగుదలనమోదుకావవడం వెనుకాల ఉపాధ్యాయుల కష్టం ఉందన్నారు. జిల్లాలో మొత్తం 7569 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 3759 మంది బాలురు, 3810 మంది బాలికలు పరీక్షలు రాయగా బాలురలో 89.49, బాలికలలో 93.96 ఉత్తీర్ణత సాధినటంశుభ పరిణామం అన్నారు. తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో, పాఠశాలల పర్యవేక్షణ, ప్రధానోపాధ్యాయులతో సమీక్షలు, మౌలిక వసతుల అభివృద్ధి, హాజరు పెంపు చర్యలలో జిల్లా అధికారులతో పాటు న్యాసేవాధికారుల పాత్ర కూడా ఉందన్నారు. గత సంవత్సరం 32వ స్థానంలో ఉన్న గద్వాల జిల్లా ఈ సంవత్సరం 26వ స్థానానికి చేరడం ఒక మంచి విద్యా అభివృద్ధి సూచికగా భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు కలసి చూపిన కృషి వల్లే ఈ ఉత్తమ ఫలితాలను వచ్చాయన్నారు. భవిష్యత్తులో ఇంకా మెరుగైన ఫలితాల కోసం మరింత కృషి చేసి విద్యా రంగాన్ని మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని ఆమె జిల్లా అధికారులను కోరారు. పదవ తరగతి ఫలితాల్లో విజయ సాధించిన విద్యార్థులందరికీ ఆమె ప్రత్యేక అభినందనలు తెలిపారు. అదే విదంగా 566 ఉత్తమ మార్కులు సాధించిన అక్షయకు న్యాయమూర్తి ప్రత్యేక అభినందనలు తెలిపారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా లోని అన్ని ప్రభుత్వ, గురుకుల పాఠశాలలో తిరిగి విద్యార్థులలో విద్యాపట్ల ఆసక్తి పెంపోందించి వారికి అవసరమైన సౌకర్యాలు, వసతులు, నాణ్యమైన విద్య అందేల కృషి చేసినట్లు తెలిపారు.

## కమలాపురంలో గావ్ చలో బస్తీ కార్యక్రమం

**శ్రీరంగాపూర్, మే2 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ కంబాలపురం గ్రామంలో భారతీయ జనతా పార్టీ నిర్వహించిన గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పనులు చేస్తున్న వారిని రాష్ట్ర సర్పంచుల సంఘంమాజీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, మండల అధ్యక్షులు విష్ణువర్ధన్ నాయుడు వారితో కలిసి మాట్లాడటం జరిగింది. అదేవిధంగా ఉపాధి హామీ కూలీలకు త్రాగునీటి కొరత లేకుండా నీటి బబుల్స్ అందించాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ చెప్పడం జరిగింది. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్వహణలో గ్రామసభలు పెట్టకుండా ఇందిరమ్మ కమిటీ ద్వారా ఇళ్లను మంజూరు చేస్తున్న విషయంపై గ్రామపంచాయతీ కార్యదర్శి ఆంజనేయులుతో వివరాలు తెలుసుకొని అసలైన లబ్ధిదారులను గుర్తించి ఎలాంటి అవకతవకలు లేకుండా అర్హులైన వారికి ఇవ్వాలని చెప్పడం జరిగింది. అలాగే జానంపేట గ్రామం నుండి 20 మంది యువకులు భారతీయ జనతా పార్టీలో చేరగా వారిని మాజి జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో డి.పురుషోత్తంరెడ్డి, లోక్‌నాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ నాయుడు, సీనియర్ నాయకులు రాములు, జానీ, రాజేష్, శివ, నరేందర్ రెడ్డి, చిట్టి రాజులశివ, కార్తీక్, వెంకటేష్ దేవాచారి భాజపా సీనియర్ నాయకులు గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించిన ఎస్పీ



**నారాయణపేట టౌన్, మే2 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఫర్హాన 571/600, టౌన్ సింధుప్రియ 571/600, రాఘవిక 566/600, శివాని 558/600 కోస్గి విద్యారులు శుక్రవారం జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఎస్పీ వారికి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించడం జరిగింది. విద్యార్థులు ఇదే ఉత్సాహంతో బాగా చదవి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని తెలిపారు. విద్యార్థులు బాగా చదవడం వల్లనే వారి జీవితాలు మారుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా వీర నాగమ్మ పండుగ



వీర నాగమ్మ పండుగ నిర్వహిస్తున్న దృశ్యం

**వెల్దండ, మే 02 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని రాచూరు గ్రామంలో కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారు వీరనాగమ్మ పండుగను గ్రామంలో గత రెండు రోజులుగా ఆరెకటిక కులస్తులు భక్తి శ్రదలతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. బండారు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

## నేడు భూభారతి పై అవగాహన సదస్సు

**చిన్నంబావి, మే 2 ప్రభాతవార్త :** చిన్నంబావి మండల కేంద్రంలో భూభారతి రెవెన్యూ చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు తహసిల్దార్ ఇక్బాల్ తెలిపారు. మండల కేంద్రంలోని సునీత ఫంక్షన్ హాల్‌లోశనివారం సాయంత్రం 4గంటలకు నిర్వహించే భూభారతి చట్టం అవగాహన సదస్సుపై రైతులు హాజరై తెలుసుకోవాలనిఅలాగే మండల పరిధిలోని కల్యాణ లక్ష్మి దరఖాస్తుచేసినలబ్ధిదారులందరూ హాజరు కావాలని తాసిల్దార్ తెలిపారు.

## 13న పాలిసెట్ 2025 ఎంట్రెన్స్ పరీక్షలు

**గద్వాల ప్రతినిధి, మే2, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 13న పాలీసెట్ 2025 ఎంట్రెన్స్ పరీక్షలు జరుగుతున్నాయని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలీసెట్ 2025 దరఖాస్తు చేసిన వారికి ఈరోజు నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గోనపాడు నందు ఉదయం గం.9:00. నుండి మధ్యాహ్నం గం:12:00 వరకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. గణితం భౌతిక మరియు రసాయన శాస్త్రాలలో ప్రతి సబ్జెక్టు గంట చొప్పున శిక్షణ ఇవ్వబడుతుందని ఇతర వివరములకు శ్రీనివాసరావు సెల్ నెంబర్ 6301529448 ను సంప్రదించాలని ఈ సందర్భంగా తెలిపారు.

## సిపిఐ ఎంఎల్, మాస్ లైన్ జీపు జాతర ప్రారంభం



**ఆత్మకూర్ మే2, ప్రభాతవార్త:** బిసి వ్యాపితంగా మే నెల ప్రారంభం నుండి చివరి వరకు కొనసాగనున్న మేడే కార్యక్రమాలను జయప్రదం చేయడంతో పాటుగా ఈనెల ఐదున మక్తల్ నియోజకవర్గంలో స్వాతంత్ర సమరయోధుడు షహీద్ భగత్ సింగ్ విగ్రహావిష్కరణ కోసం ప్రజలు భారీగా తరలి రావాలంటే సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో దీపుజాత ప్రారంభించారు ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి హనుమంతు మాట్లాడుతూ దేశవ్యాప్తంగాభగత్‌సింగ్ ఆశయాలను కొనసాగించేందుకు యువత ముందుకు రావాలని అందులో భాగంగానే మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో పీడీఎస్ యుపివైఎల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భగత్ సింగ్ విగ్రహావిష్కరణ కోసం ప్రజలు స్వచ్ఛందంగా అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు కొనసాగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా యువత తమ వంతు పాత్ర పోషించి ప్రజా వ్యతిరేక పాలన ఎండగట్టేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ప్రసాద్ రాజు వెంకటన్న తదితరులతో పాటుగా పలునాయకులు పాల్గొన్నారు.....

## అగ్ని ప్రమాదంలో రూ.4లక్షల నష్టం



పూర్తిగా కాలిపోయిన మొక్కజొన్న

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 2 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ మండలం పరిధిలోని కుమ్మెర గ్రామంలో పానుగంటి కృష్ణయ్య ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంట శుక్రవారం పూర్తిగా అగ్నికి ఆహుతయింది. అగ్నిమాపక సిబ్బందికి గ్రామస్తులు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆరిపివేశారు. అప్పటికే పూర్తిగా పంట కాలిపోయింది. దీంతో సుమారు రూ.4 లక్షల నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారి కృష్ణమూర్తి తెలిపారు. అగ్ని ప్రమాదంలో పంట పూర్తిగా నష్టపోయమని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎస్సై



**కల్వకుర్తి, మే 2 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం ఎస్ఐ మాధవరెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. వెన్నెల ఆర్గానిక్ ఫుడ్స్, వెజిటేబుల్స్ మార్కెట్ నిర్వాహకులు శ్రీకాంత్ ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ మాధవరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. వేసవికాలంలో పాదచారుల వాహనదారుల పట్టణానికి వచ్చే ఇతర గ్రామాల వారికి దప్పికను తీర్చడం అభినందనీయమని ఆయన అన్నారు. యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో చలివేంద్ర నిర్వాహకులు వెంకటయ్య తదితరులున్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న మాజీ ఎంపీపీ

**రాజాపూర్, మే 2 ప్రభాతవార్త:** కుటుంబ సభ్యులతో మాజీ ఎంపీపీ అన్నగల్ల నర్సింలు శుక్రవారం విజయవాడ దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. రాజాపూర్ మండలంతో పాటు జడ్చర్ల నియోజకవర్గ ప్రజలను చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు మాజీ ఎంపీపీ నర్సింలు పేర్కొన్నారు. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకోగా మంచి దర్శనం లభించిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## సమాజ సేవకు సైనికునిలా పనిచేస్తా

### డాక్టరేట్ అవార్డు గ్రహీత హరి నారాయణ్ బట్టడ్




**నారాయణపేట టౌన్, మే 2 ప్రభాతవార్త:** మీలో ఒకరిగా నన్ను ఆదరించండి సమాజ సేవకు ఒసైనికునిలా పనిచేస్తానని డాక్టరేట్ అవార్డు గ్రహీత హరి నారాయణ్ బట్టర్ అన్నారు. శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి అవార్డు గ్రహీత మాట్లాడుతూ అందరీ ఆదరభిమానాలతోనే నాకు డాక్టరేట్ అవార్డు వరిచిందన్నారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో స్వచ్ఛందంగా ముందుకు రావాలని సాటి మనుషులకు సహకారం అందించినప్పుడే మానవ జన్మకు సార్థకత అన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులతో పాటు మహేశ్వరీ సమాజ్ బులియన్ మర్చంట్, వస్త్రావ్యాపార సంఘం మెడికల్ అసోసియేషన్ కవులు కళాకారులు సచ్చంద సంస్థలు పూల మాల శాలువాతో సత్కరించారు. అదేవిధంగా శక్తిపీఠం వ్యవస్థపకులు పూజ్యశ్రీ డా. స్వామి శాంత నంద పురోహిత్ మాట్లాడారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు జిఆర్ రెడ్డి, కార్యదర్శి బాలాజీ కాంబ్లె, కోశాధికారి మోహన్, శ్రీనివాస్ లాహోటి, డా. వై.మల్లి కార్జున్, ఆత్మరాం ఏడికే, జనార్దన్, కన్న, జగదీశ్, రవి గౌడ్, ఉమాకాంత్ గందె, సదానంద్ చారి, కృష్ణ మూర్తి తదితరులు ఉన్నారు.

## భారత్ మాల బాధితులకు న్యాయం జరిగేలా చూడండి



ఎంపి డికె అరుణకు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**మక్తల్, మే 2 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం నూతనంగా చేపడుతున్న భారత్ మాల రోడ్డు బాధితులకు తగిన న్యాయం చేయాలని కోరుతూ భాదితులు శనివారం మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణను కలిసి విన్నవించారు. నారాయణ పేట జిల్లాలో పెద్ద చింతకుంట నుంచి టై రోడ్డు వరకు దాదాపుగా 55కిలోమీటర్ల మేరరహదారి నిర్మాణం చేపడుతుండడంతో దాదాపు 3500 మంది రైతులు తమ విలువైన భూములను కొల్పోతున్నట్లు తెలిపారు. ఈ భూములను 2019 నుంచి అధికారులు బ్లాక్ లిస్టులో పెట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఈ విషయమై ప్రత్యేక చొరవ తీసుకొని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రంకుల రామలింగం, ప్రసాద్, శైలు, మధుసూదన్ రెడ్డి, బసంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రఘు, శాంతి రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్న ఉడిపి స్వామీజీ



**నారాయణపేట టౌన్,మే2 ప్రభాతవార్త:** నారాయణపేటపట్టణంలోని రాఘవేంద్ర స్వామి ఆలయాన్ని శుక్రవారం ఉడిపిఅదిమారు మఠాధితులు విశ్వప్రియతీర్థులు దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలునిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వ ప్రియతీర్థుల స్వామీజీని విద్వాన్ అనిల్ దేశాయి, ఆలయ అర్చకులు నరసింహచారి,శేషు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అనంతరం భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తూ రాఘవేంద్ర స్వామిని కొలిచిన వారికి కొంగు బంగారంగా నిలుస్తూ కోరిన కోర్కెలు తీరుస్తున్నారన్నారు.ప్రతి ఒక్కరు రాఘవేంద్ర స్వామిని కొలిచి మానవ జన్మను సార్థకం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే




ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, మే 2 ప్రభాతవార్త:** ఇండ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం మంజూరీ చేసిన ఇందిరమ్మ ఇండ్లపై దామరగిద్ద మండలంలో సర్వేకొనసాగుతుంది. శుక్రవారం దామరగిద్ద మండల కేంద్రంలోఎంపీడీవో సాయిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి రెడ్డితో దామరగిద్దకు మంజూరైన లిస్టుతో ఇంటింటా తిరిగి సర్వే చేపట్టారు. అనంతరం ఎంపీడీవో సాయిలక్ష్మి మాట్లాడుతూ దామరగిద్ద మండలానికి 553 ఇండ్లు మంజూరి కావడం జరిగిందన్నారు. దామరగిద్దకు 61 ఇండ్లు మంజూరు అయ్యావన్నారు. అర్హులైన వారిని గుర్తించి దశలవారీగా బిల్లు అందజేయడం జరుగుతుందన్నారు. వారి వెంట పంచాయతీ సిబ్బందితో పాటు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు పొందాలని ఇంటింటా ప్రచారం

**నారాయణపేట టౌన్, మే2 ప్రభాతవార్త:** పదవ తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థినీ, విద్యార్థులు దామరగిద్ద మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ పొంది నాణ్యమైన విద్యను పొందాలని కోరుతూ శుక్రవారం ఇంఛార్జి ప్రిన్సిపాల్ అంబాజీ, సీనియర్ అధ్యాపకులు రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో దామరగిద్ద మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం కళాశాలలో చదివే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించిందన్నారు.ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ సెకండియర్ ఫలితాల్లో 87 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు.ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 67 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో కోర్సులు ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసి, సీఈసీ తెలుగు ఇంగ్లీష్ మీడియంలు ఉన్నాయన్నారు. అడ్మిషన్లు ప్రారంభం కావడం జరిగింది అన్నారు. ప్రచారం నిర్వహించిన వారిలో కళాశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఇంటింటా ప్రచారం చేస్తున్న ప్రభుత్వ కళాశాల సిబ్బంది

# లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి

- ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతంలో 500 ఇండ్లు
- 5 నుంచి 20వ తేదీ వరకు 28 మండలాల్లో భూభారతి
- నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




వీసీలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 2 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇండ్లకు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ. హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. లబ్దిదారుల ఎంపిక ఎంతవరకు పూర్తయితే అంతవరకు ఏరోజు కారోజు ఇంఛార్జి మంత్రుల నుంచి లబ్దిదారుల జాబితాకు ఆమోదం తీసుకోవాలని అలాగే ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతంలో కనీసం 500 ఇండ్లను కేటాయించి లబ్దిదారులను ఎంపిక చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం నాడు చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణ రావుతో కలిసి భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్‌లు, ఎస్.పిలతో మంత్రిగారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ ఇంటి నిర్మాణం 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మాణం జరిగేలా కలెక్టర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనర్హులని తేలితే ఇండ్ల నిర్మాణం మధ్యలో ఉన్నాకూడా రద్దు చేస్తామన్నారు. లిస్ట్1, లిస్ట్2 , లిస్ట్ 3లతో సంబంధం లేకుండా నిరుపేదలను ఎంపిక చేయాలన్నారు.

**మే 5 నుంచి 20వ తేదీ వరకు:** గత నెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో నిర్వహించిన మాదిరిగానే మే 5వ తేదీ నుంచి 20వ తేదీవరకు జిల్లాకొక మండలం చొప్పున 28 జిల్లాల్లోని 28మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. పైలట్ మండలాల్లో వచ్చిన దరఖాస్తులను ఈనెల 31వ తేదీవరకు పరిష్కరించాలని, పరిష్కారం కాని వాటికి ఎందుకు పరిష్క రించడం లేదనే విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేస్తూ దరఖాస్తును తిరస్కరించాలని కలెక్టర్లకు సూచించారు. 605 మండలాలకు గాను ఇప్పటి వరకు 590 మండలాల్లో అవగాహనా సద స్సులను నిర్వహించడం జరిగిందని ఇందులో 85,527 మంది పౌరులు,1,62, 577 మంది రైతులు పాల్గొన్నారని తెలిపారు.ప్రభుత్వ భూముల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డు లలో నమోదు చేయాలని,అసైన్డ్ ల్యాండ్‌లకు సంబంధించి పొజి షన్ మీద ఉండి పట్టా లేనివారు, పట్టాఉండి పొజిషన్ మీద లేని వారి వివరాలను సేకరించాలని సూచించారు.

**నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు:** విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈనెల 4వ తేదీన జరగనున్న నీట్ పరీక్షకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఏడాది రాష్ట్రం నుండి 72,572 మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరవుతున్నారని ఇందుకోసం 24 జిల్లాల్లో 190 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరుతో పాటు ఓఆర్ఎస్ ప్యాకట్లు, మెడికల్ కిట్ లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, సి.సి. ఎల్. ఎ డైరెక్టర్ మకరంద్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండి, విపి. గౌతమ్‌లా ఆర్డర్ డిఐజి మహేష్ భగవత్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ జిల్లాలో నీట్‌పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.జిల్లాలో 13 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, 4454 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, అబ్జర్వర్‌లతో రెండు సార్లు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అధికారులతో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహణ,గృహ నిర్మాణ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూ భారతి రెవెన్యూ సదస్సు ఎంపిక చేసిన మండలం లో మే 5 నుండి 20 వరకు నిర్వహించేందుకు షెడ్యూల్ రూపొందించి అన్ని ఏర్పాట్లు చేయాలని,రెవెన్యూ టీమ్ లను ఏర్పాటు చేసి శిక్షణ నివ్వాలని సూచించారు. విసిలో ఎస్‌పిడిజానకి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, అర్‌డిఓ నవీన్, గృహ నిర్మాణ శాఖ పిడి వైద్యం భాస్కర్, నీట్ నోడల్ అధికారి కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ సురేందర్, ఎల్‌డిఎంభాస్కర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ జిల్లా అధికారులు

## ప్రమాదాలకు నిలయంగా రోడ్ సైడ్ అంగళ్లు

**గద్వాల, మే 2, ప్రభాతవార్త:** పట్టణంలోని వివిధ ప్రాంతాలలో రోడ్డుకు పక్కనే వున్న చిన్నపాటి అంగళ్ళు ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్ పై భారీ వాహనాలు వచ్చినప్పుడు రోడ్డుకు పక్కనే నిర్వహించే చిరు వ్యాపారాల వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఆరోపిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఎక్కడ పడితే అక్కడ రోడ్ పక్కనే పచ్చి టెంకాయల షాప్, టీ స్టాళ్లు, పండ్ల దుకాణాలు, బజ్జీల బండ్లు, పానీపూరి బండ్లు ఇలా తడతర వ్యాపారాలు నిర్వహించడం వల్ల వివిధ వాహన రాకపోకలకు అంతరాయం కలిగి ప్రమాదాలకు గురవుతున్నారు. అదికారులు వీటిని దృష్టిలో వుంచుకొని ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఆటంకంగా వున్నఅంగల్లను తొలగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. గత మంగళవారం పట్టణంలోని కొత్త హౌసింగ్ బోర్డు చౌరస్తా సమీపంలో జరిగినటువంటి నర్సింగ్ కాలేజీ విద్యార్థినీల లాంటి ఘోర రోడ్డు ప్రమాదాలు భౌస్యత్తులో పునరావృతం కాకుండా ఉండేందుకుఅధికారులు ముందస్తుగా ఇలాంటి రోడ్ సైడ్ వ్యాపారాలపై చర్యలు తీసుకుంటే మంచిదని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఆరోజు జరిగిన ఘోర ప్రమాదానికి రోడ్ సైడ్ వున్న పానీపూరి బండి కూడా కారణంగా చెప్పవచ్చు అని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ముఖ్యంగా ప్రధాన కూడళ్ల దగ్గర, చౌరస్తా సమీపాలలో,జన సందోహం రద్దీగా వుండే ప్రాంతాలలో రోడ్ సైడ్ చిరువ్యాపారాలను తొలగించాలని కోరుతున్నారు.



అంబేద్కర్ చౌరస్తా నుండి బసవన్న చౌరస్తాకు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరుపక్కల వ్యాపారులు కొనసాగిస్తున్న దృశ్యం



రోడ్డు పక్కనే తాటి ముంజల విక్రయాలతో రోడ్డు పై వస్తున్న భారీ వాహనం వెనుక ముందు వచ్చే వాహనాలకు ఇబ్బందులు

## వారం రోజుల్లో పరిహారం

- భారత్ మాలా భూ బాధితులకు ఎంపీ డీకే అరుణ భరోసా
- ఎంపీకి తమ గోడు వెల్లబోసుకున్న బాధితులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే2, ప్రభాతవార్త:** పాలమూరు పరిధిలో భారత్ మాలా భూ భాధితులకు తీపి కబురు అందింది. ఒక్క ఫోన్ కాల్‌తో ఎంపీ డీకే అరుణ భూ భాధితుల సమస్య తీర్చారు. వారం రోజుల్లో పరిహారం డబ్బులు ఇప్పిస్తానని మాట ఇచ్చారు. దీంతో ఎంపీ డీకే అరుణకు కృతజ్ఞతలు తెలిపారు. భారత్ మాల బాధితులు మహబూబ్ నగర్ క్యాంపు కార్యాలయంలో ఎంపీ డీకే అరుణమ్మను కలిసారు. సమస్యలు, ఇబ్బందులపై భూ భాదితులు మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిహారం చెల్లించడంలో అలసత్వమ్ వహిస్తున్నారంటు గోడు వెళ్లబోసుకున్నారు.

**ఆర్వోకు ఫోన్ కాల్ :** పార్లమెంట్ పరిధిలోని మక్తల్, దేవరకద్ర, నారాయణపేట నియోజకవర్గాల పరిధిలోని భూభాదితుల సమస్యలపై నేషనల్ హైవే ఆర్వో శివశంకర్‌తో ఎంపీ డీకే అరుణ ఫోన్లో మాట్లాడారు. సాధ్యమైనంత త్వరలో 3000 మంది బాధితులకు పరిహారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా నేషనల్ హైవే ఆర్వో శివశంకర్ సానుకూలంగా స్పందించారు. బాధితులందరికీ వారంలో పరిహారం ఇస్తానని హామీ ఇచ్చారు. దీంతోమహబూబ్‌నగర్ ఎంపీ డికే అరుణకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

## నెలాఖరు వరకు పోలీస్ యాక్ట్

- ఎటువంటి ధర్నాలు రాస్తారోకోలు జరపరాదు
- మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 2 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతతను పెంపొందించేందుకు ఈనెల 31 వరకు, జిల్లా అంతటా 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 30 పోలీస్ఆక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదు. నిషేదిత ఆయుధములు అయిన కత్తులు, చాకులు,కర్రలు, జెండా కర్రలు, దుడ్డు కర్రలు, తుపాకులు ప్రేలుడు పదార్థములు, నేరమునకు పురిగొల్పే ఎటువంటి ఆయుధములను వాడరాదని సూచిం చారు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్ లను మరియు జన సమూహం ప్రోగు అవుట వంటివి నిషేధం. రాళ్ళను జమ చేయుట, ధరించి సంచరించుట వంటివి నిషేధం. లౌడ్ స్పీకర్‌లు, డీజేలు వంటివి కూడా ఈ సమయం లో నిషేధము. నియమాలు ఎవరైనా ఉల్లంఘించిన 30 పోలీస్ ఆక్ట్ 1861 కింద శిక్షార్హులు అగుదురని ఎస్పి పేర్కొన్నారు.




## హిందు ధర్మ ప్రాణదాత జగద్గురు ఆది శంకరులు

### శక్తిపీఠం వ్యవస్థాపకులు పూజ శ్రీ డా. స్వామి శాంతానంద

**నారాయణపేట టౌన్, మే2 ప్రభాతవార్త:** జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతిని పురస్కరించుకొని శంకర సేవా సమితి ఆధ్వర్యంలో జయంతి మహోత్సవాలను నారాయణపేట పట్టణంలోని దేవ్‌జి నివాసంలో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారి ఉత్సవమూర్తికి మహా పంచామృతాభిషేకం శారద భజన మండలి ఆధ్వర్యంలో మహిళలచే సామూహిక లలిత సహస్ర నామ పారాయణం సామూహిక కుంకుమార్చన అంతకుముందు ఆదిశంకరా చార్యుల ఉత్సవ మూర్తి శోభయాత్ర పల్లకి సేవా నిర్వహించారు. అనంతరం శక్తి పీఠం వ్యవస్థపకులు పూజ్యశ్రీ డాక్టర్ స్వామి శాంతనంద మాటాడుతు శంకరా చార్యుల విజయ గాథను వివరిస్తూ సనాతన దర్మం నేడునిలబడటానికి మూలకారకుడు జగద్గురు ఆదిశంకరులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ధరణి ధర్, దీక్షిత్, విద్యాధర్, దీరజ్ దీక్షిత్ ఉట్కూర్ శివానంద్, పురోహిత్, ఉట్కూర్ విభావసు పురోహిత్ అర్చకులు వేణు గోపాల్ చార్యులు పద్మావతి రాజేశ్వరి మహిళలు భక్తులు పాల్గొన్నారు.



ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

**నారాయణపేట టౌన్, మే 2 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాకు నూతన జిల్లా జడ్జ్‌గా వచ్చిన బోయ శ్రీనివాసులును శుక్రవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోర్టు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్క అందజేశారు.



## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**చిన్నచింతకుంట, మే2 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ దవఖానాలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన దుర్ఘటన శుక్రవారం మధ్యాహ్నం మండల కేంద్ర సమీపంలో చోటుచేసుకుంది.ఎస్సై వివరాల ప్రకారం మండలంలోని అల్లిపూర్ గ్రామానికి చెందిన బుడగ జంగం ముత్యాలు (32) శుక్రవారం మధ్యాహ్నం చిన్నచింతకుంట నుంచి అల్లిపూర్‌కు పల్సర్ బైక్ పై వెళ్తుండగా మండల కేంద్ర సమీపంలోని దేవరకద్ర ఆత్మకూరు ప్రధాన రహదారిపై అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టడంతో బలమైన గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారి గమనించి 108 అంబులెన్స్‌లో వనపర్తి జిల్లా ప్రభుత్వ దవఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ యువకుడు మృతి చెందాడు. మృతునికి భార్య ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్సై తెలిపారు.ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

## బుగ్గారెడ్డికి ఘన నివాళి



**నారాయణపేట టౌన్, మే 2 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కొత్తూరు (మం) అల్లీపూర్‌లో మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తండ్రిబుగ్గారెడ్డి వర్ధంతి కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా బుగ్గారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బుగ్గారెడ్డి పవిత్ర ఆత్మకుశాంతి చేకూరాలని వేడుకున్నారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## అధికారుల నిర్లక్ష్యం.. మిల్లర్ల దోపిడీ

### ధాన్యం కొనుగోళ్ల ఆలస్యంపై రైతుల ఆందోళన



నిరసన తెలుపుతున్న రైతులు

**నారాయణపేట, మే 2 ప్రభాతవార్త :** జిల్లాలోని, కృష్ణ మండలం గుడేబల్లూరు జాతీయ రహదారిపై రైతులు దాన్యం ట్రాక్టర్లతో నిరసన చేస్తూ ఆందోళనకు దిగారు. శుక్రవారం జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. అక్కడి రైతులు మాట్లాడుతూ 40 కేజీల బస్తాకు నాలుగు నుంచి ఐదు కిలోలు వడ్లు అదనంగా ఇస్తేనే వడ్ల బస్తాలు దింపుకుంటామని అక్కడి మిల్లర్లు అమాయక రైతులను మోసం చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక లారీ వడ్ల బస్తాలను దింపుకోవడానికి సుమారు రూ.6000 డిమాండ్ చేస్తున్నారని అక్కడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కిరాయి ట్రాక్టర్లతో వడ్లధాన్యాన్ని తీసుకొచ్చిన సన్నకారు రైతులు దాదాపు 20 రోజులుగా రైస్ మిల్లు ముందు పడిగాపులు కాస్తున్నామన్నారు. కిరాయి ట్రాక్టర్లకు రోజుకు రూ. 4000 చొప్పున కిరాయి పడుతుందని, అధికారుల నిర్లక్ష్యం వల్లనే మేము ఇంతలా నష్టపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్కడి రైతులు మాట్లాడుతూ గవర్నమెంట్‌కు బదులుగా ప్రైవేటుకు అమ్ముకున్న అంతో ఇంతో పెట్టిన పెట్టుబడి అయినా వచ్చేదని వాపోతున్నారు. ఇక్కడి రైతులు ఇన్ని విధాలుగా మిల్లర్ల దోపిడీకి గురవుతున్నప్పటికీఅధికారులుచూస్తూ చూడనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి, తమను నష్టపోకుండా చూడాలని అక్కడ రైతులు వేడుకున్నారు.

## బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

**బిజినేపల్లి, మే 2 ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతంతో ఐదేళ్ల క్రితం ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులకు విద్యుత్ శాఖ ద్వారా రూ.5 లక్షల పరిహారం చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే డా కూచుకుల్ల రాజేష్ రెడ్డి అందజేశారు. వెల్గొండ గ్రామానికి చెందిన దిడ్డి రామచంద్రయ్య 2020లో విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందాడు. అప్పటి నుంచి విద్యుత్‌శాఖ నుంచి అందాల్సినపరిహారం విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఐదేళ్లుగా అందలేదు. విషయం తెలుసుకున్న శాయిన్‌పల్లి మాజీ సర్పంచ్ మస్కూరి అవంతి శంకర్ మూడు నెలల క్రితం ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిహారం విడుదల చేయించారు. ఐదేళ్ళకు బాధిత కుటుంబానికి న్యాయం చేయించిన ఎమ్మెల్యేను బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.